క్లుప్తంగా

అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సరస్వతి

అలంపూర్: అలంపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సరస్వతి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అలంపూర్ పట్టణంలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నరసయ్య బదిలీపై సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు వెళ్లారు. ఆ స్థానంలో సరస్వతి కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి అనంతరం కలెక్టర్ సంతోష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఒకేసారి మూడు ఉద్యోగాలకు ఎంపిక



మానవపాడు: ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థిని పలువురు అభినందించారు. మండలంలోని అమరవాయి గ్రామానికి చెందిన మహేందర్‌గౌడ్ భార్య బేబి (తల్లిదండ్రులు లక్ష్మీదేవి, నర్సన్‌గౌడ్) గురుకుల ఉద్యోగాలలో జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి ప్రథమస్థానంలో నిలిచింది. డిగ్రీ పీడీ, జేఎల్ పీడీ, పాఠశాల పీడీ మూడు జాబులు ఒకే సారి సాధించింది. గురుకుల విద్యాలయాల్లో గురుకుల సంస్థ ఎండీ మల్లయ్య చేతుల మీదుగా డిగ్రీ పీడీ ఉద్యోగ నియామక పత్రాలు అందుకున్నారు. ఆమె ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలో నది అగ్రహారానికి వెళ్లే రోడ్డులో 132 కేవీ సబ్‌స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో తాత్కాలిక అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11గంటల వరకు మల్దకల్, మల్లెందొడ్డి, సాతర్ల, బిజ్వారం, కాకులారం, బూడిదపాడు, శెట్టి ఆత్మకూర్, నర్సన్‌దొడ్డి, ద్యాగదొడ్డి, ఉప్పేరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు పేర్కొన్నారు. 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వీరాపురం, పూడూరు, జమ్మిచేడు, బీచుపల్లి, ధరూరు, గోన్‌పాడు, మన్నాపురం, మార్లబీడు, అల్వాల్‌పాడు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. రైతులు, ప్రజలు సహకరించాలని పేర్కొన్నారు.

జాతరను విజయవంతం చేయాలి

కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నెలో ఈ నెల 22న మశమ్మ జాతర, పాతపాలెంలో 23న తారకేశ్వరదేవి 44వ జాతర మహోత్సవం నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచు సూర్యప్రకాష్, వెంకటేష్‌గౌడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామాల ప్రజలు భక్తులు పాల్గొని జాతరను విజయవంతం చేయాలని వారు కోరారు.

భర్త చెంతకు చేరిన భార్య

ధరూరు: ఇంట్లో భర్తతో గొడవపడిన మహిళ ఇద్దరు పిల్లలతో ఇంటి నుంచి గురువారం వెళ్లి, శుక్రవారం తిరిగి భర్త చెంతకు చేరారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ర్యాలంపాడుకు చెందిన వడ్ల హనుమంతాచారి భార్య వడ్ల రేణమ్మ అలియాస్ శారద ఇంట్లో భర్తతో గొడవ పడింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఇద్దరు కుమారులను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం గద్వాలలోని వారి బంధువుల ఇంట్లో ఉన్నట్లు గుర్తించి, వారిని, భర్తను పిలిపించి అప్పగించినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం మురికిదొడ్డికి చెందిన దుల్లయ్య కేటీదొడ్డి మండలంలోని చింతలకుంట గ్రామానికి మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఎలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ దుల్లయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డికి చెందిన హర్షవర్ధన్‌రెడ్డి అనారోగ్యంతో అకాల మరణం చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆయనతో పాటు నాయకులు ఉన్నారు.

అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: మండల కేంద్రంలో బుధవారం విద్యుత్ ప్రమాదంలో షాబాద్‌కు చెందిన ప్రైవేట్ విద్యుత్ హెల్పర్ రాణాప్రతాప్ అకాల మరణం చెందాడు. షాబాద్‌లో శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, నాయకులు అంతిమయాత్ర నిర్వహించి అంత్యక్రియలు పూర్తి చేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, వివిధ పార్టీల, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంట కల్లాలపై నిరాసక్తి

- ఖర్చు పెరగడంతో ఆసక్తి చూపని రైతులు
- మంజూరైనా ప్రారంభం కాని పనులు
- దరఖాస్తులు వేలల్లో.. నిర్మాణాలు వందల్లో..
- క్షేత్రస్థాయిలో అవగాహన కరువు..
- జాబు కార్డులుంటేనే అర్హులు..



దువాసిపల్లిలో ఏర్పాటు చేసిన రైతు కల్లం



సాసనూలులో కల్లాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎర్రవల్లిచౌరస్తా: తెలంగాణ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోంది. అందులో భాగంగానే రైతుల అభివృద్ధి కోసం రైతు వేదికలతో పాటు కల్లాల నిర్మాణాలను చేపట్టింది. నియోజకవర్గ వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న వారికి సిమెంట్, కాంక్రీట్‌తో నేరుగా రైతుల పొలాల్లోనే కల్లాలను నిర్మిస్తున్నారు. వాటి నిర్మాణానికి కావల్సిన నిధులు ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరు చేస్తున్నారు. వాటిని నిర్మించడం వల్ల రైతులు పండించిన పంటలను ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేకుండానే నేరుగా కల్లాల్లోనే ఆరబెట్టుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గానికి గతంలో 1281 యూనిట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 511 యూనిట్లను మాత్రమే రైతులు నిర్మించుకున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. మిగిలిన 770 యూనిట్లలో అవగాహన లోపంతో కల్లాల నిర్మాణం పనులు నేటికీ ప్రారంభించలేదు.

ఆసక్తి చూపని రైతులు..

కల్లాల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకున్న చాలా మంది రైతులు మంజూరైనా.. నేటికీ నిర్మాణం పనులను చేపట్టలేదు.

మండలాల వారీగా వివరాలు..

మండలం	మంజూరు	పూర్తయినవి
ఇటిక్యాల	238	58
మానవపాడు	110	104
ఉండవెల్లి	123	66
అలంపూర్	184	33
రాజోళి	196	84
వడ్డేపల్లి	174	60
అయిజ	256	106

ప్రభుత్వం నుంచి కల్లాల నిర్మాణం కోసం అనుమతులిచ్చినా నిర్మాణ ఖర్చు అదనంగా రూ.25 వేల నుంచి రూ.40వేల వరకు అదనం కావడంతో చాలా మంది రైతులు వెనక్కి తగ్గుతున్నారు. పంట పొలాల్లోనే నిర్మించుకోవాలని అధికారులు చెప్పడంతో స్థలం వాటికి కేటాయిస్తే ఉన్న కొంచెం పొలంలో పంట తగ్గుతుందని చిన్న సన్నకారు రైతులు ఆసక్తి చూపడం లేదు. పెద్దకారు రైతులు నిర్మించుకుందామని ముందుకొచ్చినా వారికి ఉపాధిహామీ పథకం జాబుకార్డులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కల్లాలు నిర్మించుకొని ప్రతి పంటను ఆరబెట్టి అమ్మితే మంచి ధరలు వస్తాయని రైతులకు అధికారులు సూచనలు చేస్తున్నారు.

కల్లాలకు అనుమతులు ఇలా..

కల్లాల నిర్మాణానికి అధికారులు మూడు రకాలుగా విభజించారు. రైతులు తమ పొలాల్లో అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి ఏవిధంగా నిర్మించాలో అధికారులు అనుమతులు ఇస్తున్నారు. 50 మీటర్ల (538 చ.అ) కల్లాన్ని నిర్మిస్తే రూ.56,187, అలాగే 60 మీటర్లకు (645 చ.అ) రూ.68వేలు, 75 మీటర్లకు (807 చ.అ) గాను రూ. 85వేల చొప్పున నిధులను మంజూరు చేస్తున్నారు.

రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలి..



మా గ్రామంలో ఇరవై యూనిట్లకు పైగా రైతు కల్లాలు మంజూరయ్యాయి. కల్లాల నిర్మాణం చేపట్టేందుకు అవగాహన లోపం వల్ల రైతులు ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు కేవలం రెండు యూనిట్లు మాత్రమే నిర్మించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి కల్లాలపై రైతులకు అవగాహన కల్పించాలి. కల్లాల నిర్మాణం చేసుకున్న రైతులకు సకాలంలో బిల్లులు మంజూరయ్యేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

– వీరన్న, రైతు, ఆర్ గార్లపాడు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి..



మండలంలో ఇప్పటివరకు 238 మంది రైతులు కల్లాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ప్రభుత్వం నుంచి అనుమతులొచ్చాయి. నిర్మాణ ఖర్చులు పెరుగుతాయని రైతులు కల్లాలను నిర్మించుకోవడానికి ముందుకు రావడం లేదు. ప్రతి రైతు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వాటికయ్యే ఖర్చంతా ప్రభుత్వమే మంజూరు చేస్తుంది.

– అనిల్, ఏపీఓ, ఇటిక్యాల

గెలుపు ఓటములు సహజం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సరిత

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన కబడ్డీ పోటీలను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి క్రీడాకారుడు సంయమనం పాటించి పోటీలో తమ ప్రతిభను కనబరిచినట్లు తెలిపారు. గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపునకు పునాది లాంటిదన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, భక్తులకు జాతర శుభాకాంక్షలు తెలిపారు. అంతకు ముందు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గంజిపేట శంకర్, బండ్ల వెంకటేశ్వర రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నల్లారెడ్డి, ఆనంద్, నల్లారెడ్డి, మల్లేష్, హన్మంతు, కొత్త గణేష్, కరాటే సత్యం, బీసన్న, తోట రాముడు పాల్గొన్నారు.

బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆటోలబంద్



ఎర్రవల్లిచౌరస్తా: బీఆర్‌టీయూ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎర్రవల్లి మండల కేంద్రంలో శుక్రవారం నియోజకవర్గ అధ్యక్షుడు బల్గెర ఉపేంద్ర ఆధ్వర్యంలో ఆటోల బంద్‌ను స్వచ్ఛందంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సులను ప్రకటించి ఆటోవాల కడుపు కొట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఉచిత బస్సులను నివారించి ఆటోవాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలు, రామాంజనేయులు, కృష్ణ, సతీష్, రాజేష్, మధు, బాషా, గురుస్వామి ఉన్నారు.

సీసీరోడ్డుకు ఎమ్మెల్యే భూమిపూజ



సీసీ రోడ్డుకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే విజేయుడు

రాజోళి: మండల కేంద్రంలోని సీసీ రోడ్డు పనులకు అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలపై గళం విప్పుతా మన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గంగిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, అశోక్ రెడ్డి, జయన్నగౌడ్ పాల్గొన్నారు.

శివదీక్ష చేపట్టిన స్వాములు



ధరూరు: శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో అర్ధ మండలం శివదీక్షను 35 మంది చేపట్టారు. వీరంతా శ్రీశైలంలో మాలధరించి ధరూరుకు చేరుకున్నారు. మొత్తం 71 మంది శివమాల ధరించినట్లు గురు స్వాములు బోయ మల్లి, కురువ దర్శెల్లి, కే. రవి, కుర్వ రవి, గోపిరెడ్డి, సీతారాములు, కారం రవిలు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో శివ స్వాములు భిక్ష చేశారు.

ప్రత్యేక తరగతుల పరిశీలన



విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలిస్తున్న ప్రతాప్‌రెడ్డి

ధరూరు: 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంతో పాటు కస్తూర్బా గాంధీ పాఠశాలలను ఆయన సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు ఉదయం అందించే బ్రేక్ ఫాస్ట్‌ను కూడా పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సీఆర్‌టీలకు ఎస్ఎస్‌సీ యాక్షన్ ప్లాన్ మీద పలు సూచనలు చేశారు. 100 శాతం లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ నర్సింహులు ఉన్నారు.

ఎస్ఎస్‌సీ ఇంటర్నల్ మార్కుల తనిఖీ



ఇంటర్నల్ మార్క్స్ వెరిఫికేషన్ చేస్తున్న టీచర్లు

ధరూరు: 10వ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బృందం సభ్యులు మండల కేంద్రానికి చేరుకున్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సంబంధించిన మార్కుల లిస్టును పరిశీలించారు. ఇంటర్నల్ పరీక్షలు ఎలా నిర్వహించారు? మార్కులు దేన్ని బేస్ చేసుకుని ఎన్నెన్ని వేశారు? అనే పలు అంశాలపై పరిశీలించినట్లు టీం హెడ్ విజయ్ తెలిపారు. ఉన్నతాధికారుల గైడ్‌లైన్స్ ప్రకారమే జరిగాయా లేదా అనే దానిపై కూడా పరిశీలించారు. కార్యక్రమంలో బృందం సభ్యులు శ్యాంసుందర్, ఎన్ వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల భక్తులు బీచుపల్లికి చేరుకొని భక్తిశ్రద్ధలతో సరస్వతీదేవిని దర్శించుకున్నారు.

ధరూరు తహసీల్దార్‌గా వెంకట్రావు

ధరూరు: తహసీల్దార్‌గా వెంకట్రావు బదిలీపై ధరూరు మండలానికి రానున్నారు. ఇక్కడ పని చేస్తున్న వహీదా ఖాతున్‌ను మానవపాడు మండలానికి బదిలీ చేశారు. ఆమె స్థానంలో తహసీల్దార్‌గా ఉండవెల్లి మండలం నుంచి వెంకట్రావు రానున్నారు. నేడో, రేపో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పట్టణంలోని బాలికోన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

గద్వాల: జిల్లాలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు బోధన చేశారు. విద్యాశాఖ మంత్రిగా సమిత, కలెక్టర్‌గా గీత, అడిషనల్ కలెక్టర్‌గా స్వేత, డీఈఓగా రేణుక, ఎంఈఓగా కృష్ణవేణి, హెచ్ఎంగా అనూషలు వ్యవహరించారు.

వెంకంపేటలో..

మున్సిపాలిటీలోని ఒకటో వార్డు వెంకంపేట యూపీఎస్‌లో స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యాశాఖ మంత్రిగా లిఖితప్రియ, విద్యాశాఖ సంచాలకుడిగా శివరాం, కలెక్టర్‌గా అక్షిత్, డీఈఓగా జగదీష్ వ్యవహరించి ప్రతిభ చాటారు.

ధరూరు: మండలంలోని మన్నాపురం పీఎస్ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌గా వీక్షిత, అడిషనల్ కలెక్టర్‌గా బీ.సుదర్శన్, డీఈఓగా లక్ష్మి, ఎంఈఓగా శ్రీదేవి, కాంప్లెక్స్ జీహెచ్ఎంగా అమృత, హెచ్ఎంగా విమలాకుమారిలు ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం యోగేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ప్రవాస్ యోజన

అయిజ: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం అలంపూర్ అసెంబ్లీ కన్వీనర్ మెడికల్ తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు అలంపూర్ అసెంబ్లీ ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సిద్ధంగా ఉండాలన్నారు. రాజగోపాల్, మాదన్న, బలరాంరెడ్డి, జగదీష్ పాల్గొన్నారు.



కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



బండలాగుతున్న వృషభరాజులు

అయిజ: మండలంలోని ఉత్తనూరులో ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులు పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ధన్వంతరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక పూజల్లో భాగంగా సుప్రభాతసేవ, తోమాల సేవ చతుర్థానార్చనలు, శ్రీలక్ష్మి నారాయణ మూల మంత్ర హోమాలు, మహా పూర్ణాహుతి, నివేదన హారతి, శాత్తుమొర్రై పూజలు నిర్వహించారు. సాయంత్రం విష్ణు సహస్రనామ పారాయణ, అవభృతస్నానం, నాగదేవి చక్రస్నానం, ధ్వజారోహణం, పుష్పయాగం, ఏకాంతసేవ, నివేదన హారతి, శాత్తుమొర్రై, తీర్థగోష్టి మహాదాశ్వీరాదం స్వస్తి పూజలు నిర్వహించారు.

ఉత్సాహంగా రైతు సంబరాలు..

ధన్వంతరి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా రైతు సంబరాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆరుపళ్ల విభాగం వృషభరాజుల బల ప్రదర్శన నిర్వహించారు. ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, నాల్గవ బహుమతి రూ. 15 వేలు, ఐదో బహుమతి రూ.10వేలు ప్రకటించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన వృషభరాజులు బండలాగు పోటీల్లో హోరాహోరీగా తలపడ్డాయి.

వైభవంగా అంజన్నకు అవభృత స్నానం



కృష్ణానదిలో స్వామి వారి అవభృత స్నానం కార్యక్రమంలో పాల్గొన్న పండితులు

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయ సమీపంలోని కృష్ణానదిలో స్వామి వారికి అవభృత స్నానం, పల్లకీసేవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి ఉత్సవ మూర్తులను పల్లకీలో భాజా భజంత్రీలతో ఊరేగింపుగా నది వరకు తీసుకెళ్లి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా అవభృత స్నాన ఘట్టం ముగించారు. అనంతరం ఆలయం వద్ద స్వామి ఆలయంలో ధ్వజం నుంచి జెండా కిందకు దింపి అర్చకులు బ్రహ్మోత్సవాలకు ముగింపు పలికారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ



తలబడుతున్న మోమిన్‌స్టార్ -వనపర్తి జట్లు

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజీవ్‌గాంధీ స్మారక ఇన్విటేషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టోర్నీ హోరాహోరీగా కొనసాగుతోంది. శుక్రవారం మొదటి మ్యాచ్ మోమిన్ స్టార్ వర్సెస్ వనపర్తి జట్లు తలబడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న మోమిన్ స్టార్ జట్టు నిర్ణీత 15వ ఓవర్లలో 173 పరుగులు చేసి 7వికెట్లు కోల్పోయింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన వనపర్తి జట్టు 122పరుగులు చేసి 8వికెట్లు కోల్పోయి ఓటమిపాలయ్యింది. 51 పరుగులతో మోమిన్ స్టార్ విజయం సాధించింది. ఇక రెండో మ్యాచ్ మొదటి క్వాటర్ ఫైనల్‌లో డీటీడీసీ నర్సింహ వర్సెస్ శ్రీ సౌమ్య ఇన్‌ఫ్రా జట్లు తలబడ్డాయి. శ్రీ సౌమ్య ఇన్‌ఫ్రా జట్టు టాస్ గెలిచి ఫిల్డింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ చేసిన డీటీడీసీ నర్సింహ జట్టు 15 ఓవర్లలో 77పరుగులు చేసి ఆలౌట్ అయింది. లక్ష్యం దిశగా బ్యాటింగ్ చేపట్టిన శ్రీసౌమ్య ఇన్‌ఫ్రా జట్టు 9ఓవర్లలో 78 పరుగులు చేసి విజయం సాధించింది. కాంగ్రెస్ నాయకులు నల్లారెడ్డి, ఇసాక్, తిమ్మన్న, జమాల్, జగదీష్, జహంగీర్, నవీన్, కౌసర్‌బేగ్, వీరేష్ ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల ర్యాలీ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహులు

అయిజ: రైతుల హక్కుల సాధన కోసం తలపెట్టిన భారత్ బంద్‌కు సంఘీభావంగా సీఐటీయూ పిలుపు మేరకు శుక్రవారం మండల కేంద్రంలో మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, హమాలీ కార్మికులు, ఆశా కార్యర్తలు, కర్నూల్ రోడ్ చౌరస్తా నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ ఇచ్చిన హామీలు నెరవేర్చడంలేదని, కార్మికులు కర్షకులు ఏకమై రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు.

బూత్‌లెవల్ ఏజెంట్ల నియామకం



సమావేశంలో కాంగ్రెస్ నాయకులు

అయిజ: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో 26 పోలింగ్ బూత్‌లకు సంబంధించి ఏజెంట్లను నియమించారు. కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి మాస్టర్ షేక్షావలి ఆచారి, పట్టణ అధ్యక్షుడు మధుకుమార్, కౌన్సిలర్ రాజెమ్మ, మద్దిలేటి, సాంబశివుడు, పాండురంగ, నరసింహులు, చెన్నప్ప, శివరాజు, దూద్‌పాషా, మహేంద్ర, ఈరన్న, తిరుమలేష్ ఆచారి, రాముడు, అనిల్ పాల్గొన్నారు.

ఎంపీడీఓ సేవలు మరవలేనివి



ఎంపీడీఓ కృష్ణయ్యను సన్మానిస్తున్న సిబ్బంది

మల్దకల్: మల్దకల్ ఎంపీడీఓగా పని చేసి ఇటీవల బదిలీపై సిద్దిపేటకు వెళ్లిన ఎంపీడీఓ కృష్ణయ్య సేవలు మరవలేనివని ఎంపీపీ రాజారెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ సమావేశపు హాల్లో ఎంపీడీఓ కృష్ణయ్యకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతి నిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హరికృష్ణ, తహసీల్దార్ హరికృష్ణ, ఎంపీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, నర్సన్న, సూర్యప్రకాష్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తిమ్మారెడ్డి, పెద్దవీరన్న, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐగా విజయ్ భాస్కర్

అయిజ: నూతన ఎస్‌ఐగా విజయ్‌భాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నిబంధనల మేరకు పని చేస్తానని, బాధితులు మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా వచ్చి సమస్యలను తెలుపాలన్నారు. శాంతిభద్రతలు కాపాడేందుకు నిరంతరం కృషిచేస్తానని అన్నారు.